# మారనీ...

ఏదన్నా మామూలుగా జరిగేదానికి భిన్నంగా జరిగితే కొందరు బిత్తరపోతారు. జీర్ణించుకోలేరు.

మార్పు సహజం. ప్రకృతిలో కూడా ఎప్పుడూ ఏదో ఒక మార్పు జరుగుతూనే ఉంటుంది. వాతావరణం సాధారణంగా క్రమబద్ధంగా మారుతుంటుంది. ఒకోసారి విరుద్ధంగానూ ఉంటుంది.




శాస్త్రం ప్రకారం మొదట ఉన్న నీరు అలాగే ఉండివుంటే ఈ ప్రపంచం లేదు. ప్రాణికోటి లేదు. ఎన్నో మార్పులు జరిగి జరిగి ప్రస్తుత ప్రపంచానికి ఈ రూపం వచ్చింది.

కమ్మరి కొలిమి, కుమ్మరి చక్రం జాలరి మగ్గం ఇంకా పల్లెటూళ్లలో అక్కడక్కడా ఉన్నప్పటికీ, వాటి స్థానంలో యంత్రాలు వచ్చాయి. నాగలి స్థానంలో ట్రాక్టర్ వచ్చింది. మట్టి పాత్రల స్థానంలో ఇత్తడి, స్టెయిన్ లెస్ స్టీల్ వంటి రకరకాల పాత్రలు వచ్చాయి.

ప్రయాణానికి ఎడ్లబళ్ల స్థానంలో బస్సులొచ్చాయి. విమానాలొచ్చాయి. పడవల స్థానంలో స్టీమర్లొచ్చాయి. ఓడలొచ్చాయి.

వస్త్రధారణలో కూడా అనేక మార్పులొచ్చాయి. పంచెల స్థానంలో పేంటులొచ్చాయి. పొడుగు చొక్కాల స్థానంలో బుష్షర్టులొచ్చాయి. తలపాగాల స్థానంలో టోపీలు వచ్చాయి.

మట్టిబాటల స్థానంలో కంకరరోడ్లొచ్చాయి. తారు రోడ్లొచ్చాయి. సిమెంట్‌రోడ్లొచ్చాయి.

పూరిగురిసెల స్థానంలో పెంకుటిళ్లొచ్చాయి. మేడలొచ్చాయి.

కట్టెల పొయ్యిల స్థానంలో ఊక పొయ్యిలొచ్చాయి. కిరోసిన్ స్టవ్‌లు వచ్చాయి. గేస్ పొయ్యిలొచ్చాయి.

కుండలు వంటి మట్టి పాత్రల స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు వచ్చినప్పుడు, అవి ఆరోగ్యానికి మంచివికావేమోనని చాలామంది మొదట్లో వెనుకాడారు. అలాగే కిరోసిన్, గేస్ పొయ్యిల విషయంలోనూ జరిగింది. కొంతకాలానికి అలవాటు పడ్డారు.

గోటీబిళ్లా వంటి ఆటల స్థానంలో క్రికెట్ వంటి ఆటలొచ్చాయి. మొదట్లో అవంటే ఆసక్తిలేనివాళ్లు కూడా తర్వాతర్వాత ఆ ఆటలు చూడటానికి రేడియోకో, టీవీకో అంటిపెట్టుకుపోవడం చూస్తున్నాం.

అతరిక్షంలో కూడా అనేక మార్పులొచ్చాయి.

కొత్త గ్రహాలు ఏర్పడ్డాయి. "చందమామ రావే. జాబిల్లిరావే" అంటూ ఒక వ్యక్తిగా ఆరాధించిన మానవుడు, అదొక గ్రహం అని తెలుసుకుని, దానిమీద కాలుకూడా మోపాడు రాకెట్‌లో వెళ్లి.

సంస్కృత భాష తెరమరుగై గ్రాంధికం వచ్చి, దానికీ కాలం చెల్లి, వాడుక భాష మొదలయ్యింది. ఏ పత్రిక చూసినా, అందులో మనం మాట్లాడే భాషనే చూస్తునాం.

చంద్రగ్రహం మీద మనిషి కాలు మోపాడనే వార్తను 'అబ్బే, అబద్ధం, అదింకేదో ప్రదేశం అయ్యుంటుంది' అని మొదట్లో కొందరు ఒప్పుకోని సంగతి మనకు తెలుసు. అలాగే వాడుక భాషను రాయడానికి కూడా కొందరు ప్రారంభంలో ఒప్పుకోలేదు. గిడుగు వంటి మహానుభావులు వాడుక భాషోదయం చెయ్యాల్సి వచ్చింది.

రాజులు పోయారు రాజ్యాలు పోయాయి. జమిందారీలు పోయాయి. ప్రజా ప్రభుత్వాలు వచ్చాయి. ఇవేవీ సులువుగా జరగరాలేదు. ఎన్నో ఉద్యమాలూ పోరాటాలూ జరగడం ద్వారా ఈ మార్పులొచ్చాయి.

బ్రిటన్‌లో ఇంకా రాచరిక వ్యవస్థవుంది. బ్రిటిష్ రాణి రెండో ఎలిజబెత్ రాజకుటుంబం సర్వసౌభాగ్యాలతో కొనసాగుతోంది. ఆ కుటుంబం సముద్రయానం చెయ్యడానికి 125 మీటర్ల పొడవైన బ్రిటానికా నౌక ఉంది. బ్రిటిష్ యువరాజు చార్లెస్, ఆయన భార్య డయానా హనీమూన్‌కు బ్రిటానికా నౌకలోనే వెళ్లారు. వారిద్దరూ విడిపోయేముందు ఆ నౌక నుంచే ప్రజలకు దర్శనం ఇచ్చారు. ఇప్పుడా నౌకకు ఆ రాజకుటుంబం వీడ్కోలు చెబుతోంది. సమారు 255 మంది సిబ్బందితో నడిచే ఆ నౌకకు ఏడాదికి 16 మిలియన్ డాలర్లు ఖర్చవుతోంది. గత నలభై ఏళ్లల్లో బ్రిటన్ రాజకుటుంబీకుల ప్రయాణాలలో ఎన్నో మార్పులొచ్చాయనీ ఇక రాజనౌక అవసరం లేదనీ ఎలిజబెత్ రాణి అన్నట్టు ఆ దేశ రక్షణ శాఖ కార్యదర్శి మాల్కమ్ రిఫ్‌కైండ్ అన్నాడు.

అంతేకాదు, తానూ మిగతా పౌరులతో పాటు పన్నులు చెల్లిస్తానని బ్రిటన్ రాణి ప్రకటించింది. అందుకే మార్పులు జరగనివ్వాలి. మంచికెప్పుడూ ఆహ్వానం పలకాలి.

27.6.94

ఆంధ్రభూమి దినపత్రిక